ప్రజాశక్తి
గురువారం 2 అక్టోబరు 2025
5
శ్రీకాకుళం

పలాసలో కేంద్రీయ విద్యాలయానికి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - పలాస

పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయనుండగా, జిల్లాలో పలాసలో ఏర్పాటు కానుంది. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు తదితరులు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారమైందన్నారు.

నదులకు వరద ముప్పు

- నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాలో ఈనెల 2, 3 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నేపథ్యంలో వంశధార, నాగావళి నదులకు వరద ముప్పు పొంచి ఉందని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. 3వ తేదీన ఈ నదుల్లోని ప్రధాన జల వనరుల వద్ద నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటే అవకాశం ఉందని ఫ్లడ్ ఇన్‌ఫ్లో ఫోర్‌కాస్ట్ బులిటెన్ వెల్లడించింది.

వంశధార పరివాహక ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. గొట్టాబ్యారేజీ వద్ద 3వ తేదీన నది ప్రవాహం ప్రమాద హెచ్చరిక దాటే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. మూడో ప్రమాద స్థాయికి చేరితే శ్రీకాకుళం, గార, కొత్తూరు, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాల్లోని సుమారు 48 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అంచనా. రెండో స్థాయి వద్ద 39 గ్రామాల్లో ముందస్తు సన్నాహకాలు చేయాలని నివేదిక తెలిపింది.

నాగావళి పరివాహక ప్రాంతంలోనూ మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తోటపల్లి, నారాయణపురం జల వనరుల వద్ద 3వ తేదీన ప్రమాద హెచ్చరిక దాటే అవకాశముందని బులిటెన్ పేర్కొంది. దీంతో ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల మండలాల్లోని 11 గ్రామాలు వరద ముప్పు ఉండవచ్చని అధికారులు హెచ్చరించారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు, నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు వారికి కేటాయించిన స్థానాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లైన్ డిపార్ట్‌మెంట్లన్నీ అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08942 240557 నంబరుతో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. సహాయక బృందాలు విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

దసరా మహోత్సవాల సందర్భంగా మండలంలోని గాజులకొల్లివలస సమీపాన సంగమేశ్వర స్వామి ఆలయం దిగువ సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన దుర్గాదేవి సైకత శిల్పం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

తగ్గిన మందుల ధరలపై అవగాహన

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిఎస్‌టి 2.0 సంస్కరణల కారణంగా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే మందులు, వైద్య పరికరాలు, అత్యవసర మందుల ధరలు తగ్గాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. 12 శాతం నుంచి 5 శాతానికి జిఎస్‌టి శ్లాబ్ తగ్గడం, కొన్నింటిపై పూర్తిగా తగ్గించడంతో ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. చిన్నారులకు ఉపయోగించే నాప్‌కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిల్స్, వ్యక్తిగత ఆరోగ్య బీమాపై జిఎస్‌టి తగ్గించినట్లు వివరించారు. పొగాకు దానికి సంబంధించిన ఉత్పత్తులపై 28 శాతం నుంచి 40 శాతానికి పెంచడం వల్ల పొగాకు వినియోగం తగ్గుతుందని, తద్వారా కేన్సర్ ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. జిఎస్‌టి తగ్గించడం వల్ల ఆరోగ్యం మెరుగు కోసం సులువుగా చికిత్సలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి జిఎస్‌టి 2.0తో వైద్య రంగానికి సంబంధించిన ఆర్థికపరమైన ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని 72 పిహెచ్‌సిల వైద్యులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి నల్ల రిబ్బన్లు ధరించి ప్లకార్డులు, బ్యానర్లతో ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నేటివరకు అమలు చేయకపోగా, అందుకు విరుద్ధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. 25 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు లేవని, వెంటనే ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలని కోరారు. ఇన్-సర్వీస్ పిజి కోటాను పునరుద్ధరించాలని, 99 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50శాతం మూల వేతనాన్ని గిరిజన భత్యంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.ఐదు వేల భత్యం మంజూరు చేయాలన్నారు. పట్టణ వైద్యాధికారుల సర్వీస్ అర్హత సమస్యలను పరిష్కరించడం, ఇతర అన్ని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని పిహెచ్‌సిల్లో ఎంతో కష్టపడి సేవలందిస్తున్నామని, వాటిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏడు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి వైద్యులు

తాగునీటి సరఫరాలో జాప్యమెందుకు?

ఉద్దానం, మెగా ప్రాజెక్టుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - కవిటి

ప్రతి గ్రామానికీ తాగునీటి సరఫరా చేసేలా ఆయా మండలాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా విప్ అశోక్ మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా నిరాటంకంగా సాగిన ఉద్దానం మంచినీటి సరఫరా పథకం మెగా ప్రాజెక్టు రాకతో అస్తవ్యస్తమైందన్నారు. దశాబ్దాలుగా అందులో పనిచేసిన సిబ్బందిని ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో తొలగించడాన్ని తప్పుపట్టారు. దీనిపై ఉద్దానం ఇఇ శంకర్‌బాబు, డిఇ మురళీ మోహన్ కలెక్టర్‌కు నివేదిస్తూ 380 గ్రామాల్లో 374 గ్రామాలకు నీరందుతోందని, 35 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇకపై ఉద్దానం ప్రాజెక్టు అనకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలోనే పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రూ.55 కోట్ల ఉపాధి హామీ నిధులు మంజూరైనా పనుల్లో జాప్యమవుతోందని విప్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర ప్రాంత రహదారుల నిర్మాణంలో అటవీ శాఖతో అవాంతరాలు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ దీనిపై చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరారు. పనులు జరిగేందుకు అవసరమైతే బయటి కాంట్రాక్టర్లను తీసుకురావాలని విప్ సూచించారు. సోంపేటలో డ్రైనేజీలు పూడుకుపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కవిటి, ఇచ్ఛాపురం పరిస్థితి అలాగే ఉందని స్పష్టం చేశారు. ఇకపై పారిశుధ్య నిర్వహణపై పూర్తి దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు.

కవిటి పిఆర్ ఎఇ ప్రవీణ్ కుమార్ సమీక్షకు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయగా, కలెక్టర్ ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విప్ అశోక్ తీవ్రంగా స్పందించగా, కలెక్టర్ ఇకపై పంచాయతీకి సంబంధించిన ప్రతి నిర్మాణం డిపిఒ పరిశీలించిన తర్వాతే అమలులోకి రావాలని స్పష్టం చేశారు.

జిఎస్‌టి అవగాహన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్, కలెక్టర్

సమీక్షలో డ్వామా పీడీ సుధాకర్, ఆర్‌డిఒ వెంకటేష్, కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, డిపిఒ భారతి సౌజన్యతో పాటు నాలుగు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండలంలోని బల్లిపుట్టుగలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పింఛన్లను పంపిణీ చేశారు. కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లతో పాటు కొంతమంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ క్రమంలో గ్రామస్తులు రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, భూ సమస్యలు, శ్మశానవాటికకు రహదారి, డ్రైనేజీ నిర్మాణం తదితర సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిఎస్‌టి అవగాహనా కార్యక్రమంలో భాగంగా కవిటి మూడు రోడ్ల కూడలి నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు విప్ అశోక్‌తో పాటు ట్రాక్టర్ ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, టిడిపి మండల అధ్యక్షులు కృష్ణారావు, పిఎసిఎస్ చైర్మన్ ఎర్రబాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల విజయదశమి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, శ్రీకాకుళం సిటీ

జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి సత్యం, ధర్మం, న్యాయం చెడుపై సాధించే విజయానికి ప్రతీక అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతిఒక్కరి జీవితంలో ఆనందం, సుభిక్షం నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, అధర్మంపై ధర్మం గెలుపు విజయ దశమి అని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా, సుఖ సంతోషాలతో దసరా పండగ చేసుకోవాలని కోరారు. విజయదశమి ప్రతి ఇంటికి ఆనందం, ఐకమత్యం, శాంతి, సౌభ్రాతృత్వం నింపాలని, సమాజంలో సద్భావన, సత్యనిష్ఠ, ధైర్యం, సహనంతో జీవించేందుకు ఈ పండగ ప్రేరణ కలిగిస్తుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు. విజయదశమిని అందరూ ఆనందంగా, సంతోషంగా చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

వృద్ధుల ఆరోగ్యం, ఆర్థిక భద్రత, సామాజిక మద్దతు అందించడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. నగరంలోని సానావీధిలోని మదర్ థెరిసా హోంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల విలువ, వారి అనుభవం, మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు. వృద్ధులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని హామీనిచ్చారు. సీనియర్ సిటిజన్ చట్టం కింద వృద్ధులకు అందే న్యాయ సహాయాన్ని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి కిరణ స్పర్శ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదిత్యుని మూలవిరాట్టును సూర్యకిరణాలు బుధవారం తాకాయి. ఆరు నిమిషాల పైబడి పాదాల నుంచి శిరస్సు వరకు భానుని కిరణాలు స్పృశించాయి. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు యాత్రికులు ఆలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. వేకువజామున నాలుగు గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో ఉదయం 6.10 గంటల సమయంలో బంగారు రంగులో లేలేత కిరణాలు స్వామి మూలవిరాట్టుపై ప్రకాశించడాన్ని కళ్లార్పకుండా చూశారు. ఆలయ గోపురం నుంచి గర్భగుడిలోని స్వామివారి మూలవిరాట్టుకు మధ్య 350 అడుగుల దూరం ఉంటుంది. ఆలయ ప్రాకారాలు, మండపం, ధ్వజస్తంభాన్ని దాటుకొని సూర్య కిరణాలు స్వామి వారి విగ్రహాన్ని తాకడం విశేషం. ఏటా దక్షిణాయనం, ఉత్తరాయణం మార్పుల్లో భాగంగా అక్టోబరు 1, 2 మార్చి 9, 10 తేదీల్లో ఆదిత్యున్ని సూర్యకిరణాలు స్పర్శిస్తుంటాయి.

ఎన్నికల వ్యవస్థలో ఎన్నో అక్రమాలు

కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం గాడి తప్పిందని, దీంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశముందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. ఎఐసిసి పిలుపు మేరకు నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో 'ఓట్ చోరీ గద్దీ చోడ్' పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించి, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 15 వేల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈనెల 15వ తేదీన వాటిని ఎఐసిసి, పిసిసికి అందజేయనున్నట్లు చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిని రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో సహా నిరూపించారని తెలిపారు. పార్లమెంట్ లోపల, బయట రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం గానీ ఎన్నికల సంఘం గానీ సమాధానాలు చెప్పలేకపోతున్నాయని విమర్శించారు. ఇటీవల బీహార్‌లో సుమారుగా కోటి మంది ఓటర్ల అవకతవకలపై రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు బీహార్ ఎన్నికల కమిషన్ అవకతవకలపై అడగ్గా అది వాస్తవమేనని అంగీకరించిందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవస్థలను తన చెప్పు చేతుల్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని దుయ్యబట్టారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృపారాణి తదితరులు

దేశ ప్రజలు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని, ఓటు చోరీని అరికట్టడంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇసి ఓటర్ల జాబితాను దేశ ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీ విషయంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి బిజెపి అడ్డదారుల్లో అధికారం చేపట్టి దేశంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు, కిల్లి రామ్మోహన్‌రావు, సనపల అన్నాజీరావు, రెల్ల సురేష్, కరిమజ్జి మల్లేశ్వరరావు, మంత్రి నరసింహమూర్తి, కోత మధు, పూడి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు పెంపు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

రైతులు పండించిన పంటకు ఈ క్రాప్ నమోదు తప్పకుండా చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. మండలంలోని బన్నువాడలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, కరువు సమయాల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి వ్యవసాయానికి సహకారం, ఆర్థిక సహాయం పొందేందుకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు సమయం ముగిసినా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మరో 20 రోజులు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 64 లక్షల మందికి రూ.34 వేల కోట్లను పింఛన్ల కోసం వెచ్చిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేలో ఏర్పడిన భూ సమస్యల పరిష్కారానికి ఆర్‌డిఒ వద్దకు వెళ్లాలని సూచించారు. పోర్టు రోడ్డు వల్ల ఏర్పడిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నామన్నారు. ఇందుకు గానూ వంశధార కాలువల ద్వారా నీరు వెళ్లేందుకు వీలుగా అండర్‌పాసేజ్‌లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజురు చేసినట్లు తెలిపారు. త్వరలో విద్యుత్ ఛార్జీలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యూనిట్‌కు 13 పైసలు చొప్పున ఛార్జీలు తగ్గనున్నట్లు వివరించారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్‌ను ఇంటి వినియోగానికి పోనూ మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థలకు విక్రయించవచ్చని చెప్పారు. డిఎపి, యూరియా అధిక వినియోగం వల్ల భూసారం కోల్పోయి ప్రాణాలకే ముప్పు ఉండే అవకాశం ఉందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. ఇకపై రైతులు పండించే పంటకు ఎంతమేరకు ఎరువులు అవసరమో, ఆమేరకు రైతుల ఇంటి వద్దకే యూరియాను పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడుకోవచ్చని సూచించారు. భూసారం పెంచేందుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిఎస్‌టి 2.0 పోస్టర్లను ఆవిష్కరించారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, సహాయ సంచాలకులు జగన్మోహన్, పిఆర్ ఇఇ ఎం.సుధాకరరావు, వంశధార ఇఇ శేఖర్‌బాబు, ఎంపిడిఓ రేణుక, ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరి, మాజీ ఎంపిపి మట్ట సుందరమ్మ, టిడిపి నాయకులు మెండ దమయంతి, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉపాధ్యాయ అభ్యర్థులకు రేపట్నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిఎస్‌సి-25 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల మూడో తేదీ నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కార్యక్రమం పదో తేదీ వరకు కొనసాగుతుందని, అభ్యర్థులు ఉదయం ఏడు గంటలకు సంబంధిత శిక్షణా కేంద్రాల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో విధులు చేపట్టక ముందే బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, విద్యార్థి-కేంద్రిత పాఠ్య విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. ప్రతి అభ్యర్థి హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

తెలుగు, హిందీ, ఒరియా, ఇంగ్లీష్ ఉపాధ్యాయ అభ్యర్థులు గ్లోబల్ జూనియర్ కాలేజీ (ఆదివారంపేట, బలగ)లో రిపోర్టు చేయాలని తెలిపారు. బయోలాజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ అభ్యర్థులు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (వాడా జంక్షన్, అరసవిల్లి ఆలయం పక్కన)లో హాజరు కావాలని సూచించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ స్టడీస్ అభ్యర్థులకు శ్రీ మహాలక్ష్మి నిలయం (ఓల్డ్ హాస్టల్, ప్రకాశ్‌నగర్ కాలనీ, గోంటి వీధి, సరస్వతి థియేటర్ దగ్గర) శిక్షణా కేంద్రంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఫిజికల్ సైన్స్, ఎస్‌జిటి అభ్యర్థులు విశ్వ విజేత జూనియర్ కాలేజీ (మహాలక్ష్మీనగర్, శ్రీచైతన్య స్కూల్ వెనుక)లో హాజరు కావాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు అభ్యర్థులకు నూతన విద్యా విధానం ఆధారంగా శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు.

జిఎస్‌టిపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిఎస్‌టి తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, జిఎస్‌టి అధికారులతో బుధవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ తర్వాత మిగిలిన శాఖలు జిఎస్‌టిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపిడిఒలను ఆదేశించారు. రానున్న రెండు రోజుల్లో పరిశ్రమలు, వాణిజ్య పన్నులు విద్యుత్, చేనేత శాఖలు ఉంటాయని చెప్పారు. నాలుగు శాఖలు జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో, అన్ని స్థలాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముందుగానే ప్రణాళిక తయారు చేసుకుని విజయవంతంగా నిర్వహించాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA.52/2024 in HMOP.219/2023

Between:-
Simhadri (Kuppili) Bhagyasri ----Petitioner
And:-
Kuppili Shanmukha Rao ----Respondents

To,
Kuppili Shanmukha Rao,
S/o, Late Shankara rao,
Employee R/a Pedda Korada Street,
Hiramandalam village & Mandal,
Srikakulam District.

NOTICE TO THE RESPONDENT :-

It is to Inform you that the above matter i.e IA.52/2024 in HMOP.219/2023 on the file of Principal Senior Civil Judge Court at Srikakulam District is posted to **17-10-2025** for your appearance you are here by directed to appear before the above Court at **10:30 AM., on 17-10-2025** inperson or through advocate without fail Otherwise the matter will be decided in your absence

// By Order of the Court //

PALISETTI MURALI KRISHNA
Advocate, Srikakulam,
Cell: 9440371133.

మాట్లాడుతున్న రమణ

కార్మిక హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సోంపేట మండలంలో ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు. శ్యాంపిస్టన్ ప్లాంట్ 3 యూనియన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం నిక్కచ్చిగా, నిరాటంకంగా పోరాడే సంఘం సిఐటియు అని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు సంఘం ఏర్పాటు చేయకముందు ఏ ఒక్క కార్మికుడికి ఎటువంటి హక్కులు ఉండేవి కావని అన్నారు. సిఐటియు ఆధ్వర్యాన సంఘాలు ఏర్పాటు చేసి కార్మిక సమస్యలపై పోరాటాలు చేసిన తర్వాత కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, సెలవులు, మెరుగైన జీతాలు, అనేక రకాలైన హక్కులు సాధించుకోగలిగారని గుర్తు చేశారు. భవిష్యత్‌లోనూ కార్మికుల హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.ఆదినారాయణ పి.దుర్గాప్రసాద్, ఎం.సూర్యనారాయణ, కె.అప్పలనాయుడు, పి.మహేష్ పి.శ్రీనుబాబు, ఎల్.చక్రధర్, జె.వెంకటసూరి, ఎం.నాగభూషణ, పి.సురేష్, కె.నాగార్జున, పి.నాగరాజు పాల్గొన్నారు.

అర్హత ప్రామాణికంగా పింఛన్లు

రణస్థలం : పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పొందూరు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేస్తామని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కోటిపల్లి, మజ్జిగూడెం గ్రామాల్లో బుధవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని అన్నారు. అనంతరం బంటిలంకలో వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవ రావు, కూటమి నాయకులు కూన వెంకట సత్యనారాయణ, బలగ శంకర్ భాస్కరరావు, రమణ, జనక చక్రవర్తి పాల్గొన్నారు.

రణస్థలం: పేద ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుపతిపాలెం, నెలివాడ గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.

పోలాకి : మండలంలోని వనిత మండలం, కుమ్మరి కాలనీల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, కరిమి ఈశ్వర రావు, ఎన్ని రమేష్, కాయ రవి, ధర్మాన అమ్మన్నాయుడు, దిలీప్ పాల్గొన్నారు.

పొందూరు : పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

క్రికెట్ టోర్నీ విజేత ఇచ్ఛాపురం

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే మైదానంలో అండర్ 12 ఇయర్స్ క్రికెట్ టోర్నమెంట్ కొన్ని రోజులుగా జెపిసిసి, గ్రీన్ ఆర్మీ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్, ఇతర సంఘాల ఆధ్వర్యాన నిర్వహించారు. బుధవారం నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ఇచ్ఛాపురం టీం విజేతగా నిలిచింది. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు నుంచి 10 జట్టు తలపడ్డాయి. ఫైనల్‌లో ఇచ్ఛాపురం, పలాస మధ్య రసవత్తరంగా సాగింది. చివరకు ఇచ్ఛాపురం టీమ్ గెలుపొందింది. అనంతరం జిల్లా క్రికెట్ ఎపిసి ఎంపిక కమిటీ మెంబర్ కె.కెరిక్, జనరల్ సెక్రెటరీ నగిరి జెన్నీ, కాశీబుగ్గ డాక్టర్ కూన పవన్‌కుమార్ మాట్లాడారు. పలాసలో క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రోత్సాహం ఎక్కువగా ఉందన్నారు. ఇకపైన క్రికెట్ సంబంధించిన ఏ విధమైన సహాయం, సహకారాలు కావాలన్న జిల్లా క్రికెట్ సంఘం నుంచి అందిస్తామని తెలియజేశారు. క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడా ప్రతిభ బయటపడుతుందన్నారు. బౌలర్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ డిస్పాక్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్షిత్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కల సాయి నిలిచారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ పలాస అధ్యక్షులు పి.వి.వి.ఎస్.రావు, ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ యూనియన్ మెంబర్ సిర్ల రాజశేఖర్, రైల్వే యూనియన్ నాయకులు రవిపాటి, దువ్వాడ విక్రమ్, రామారావు, భాస్కరరావు, ఆర్.భీమారావు, తాతారావు, కోచ్‌లు జగదీష్, గోపి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మూల మల్లికార్జునరావు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఇచ్ఛాపురం క్రికెట్ అసోసియేషన్ మెంబర్ ఈశ్వరరావు, గణేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రోఫీతో ఇచ్ఛాపురం జట్టు

ప్రారంభిస్తున్న సర్పంచ్ బాలరాజు

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం అవుతాయని, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడులో నియోజకవర్గ ఆహ్వానిత కబడ్డీ పోటీలను బుధవారం ప్రారంభించారు. కబడ్డీ పోటీలు స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రతి ఆటగాడూ సోదరభావంతో మెలగాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి 32 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. అంతకు ముందు గ్రామంలోని జూనియర్ కబడ్డీ పోటీలను నిర్వహించగా, అమలపాడు చిన్నారులు అద్భుతంగా రాణించారు. మూడు రోజుల పాటు పోటీలు రసవత్తరంగా సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖరావు, ఉప సర్పంచ్ కారాడ గిరిబాబు, డి.ఢిల్లీరావు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా సంతోష్ కుమార్

నందిగాం : మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఒగా కె.సంతోష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేసిన టి.రాజారావు ఎంపిడిఒగా ఉద్యోగోన్నతిపై వెళ్లిపోయారు. దీంతో కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోష్ కుమార్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ డిఎల్‌పిఒ ఐ.వి.రమణ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.

కవిటిని ప్రత్యేక జోన్‌గా ప్రకటించాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కవిటి: కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన కవిటిని ప్రత్యేక జోన్‌గా ప్రకటించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇటీవల గిరిజన ప్రాంతాల ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల జీతాలు పెంచిన జిఒ కవిటి మండలంలో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆమె అన్నారు. ఈ నెల 26న కవిటిపై చిన్నచూపేలా? అంటూ 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం కవిటి సిహెచ్‌సిని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ విప్, మరోవైపు ఆస్పత్రి అభివృద్ధికమిటీ చైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే కవిటిని ఎందుకు ఆ జాబితాలో చేర్పించలేకపోయారని ఆమె ప్రశ్నించారు. ఒక సాధారణ ఎమ్మెల్యేలా అసెంబ్లీలో ఆయన కవిటి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక కిడ్నీ రోగులకు తామే అన్నీ చేశామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే తన మాటలు సరిదిద్దుకోవాలని హితవు పలికారు. కిడ్నీ రోగులకు రూ.10వేలు పింఛను ఇవ్వడమే కాకుండా వారికి ఆస్పత్రికి చేరుకునేలా అంబులెన్స్ సేవలు అందించిన ఘనత కూడా వైసిపిదేనని అన్నారు. ఇప్పుడు రవాణా సదుపాయం లేక డయాలసిస్ రోగులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరితో పాటు క్రియేటిన్ 5 పాయింట్లు దాటిన వారికి రూ.5 వేలు, ఇవ్వడమే కాకుండా పెరాలసిస్, లెప్రసీ, హెచ్‌ఐవి రోగులకు కూడా రూ.5వేలు పింఛను ఇచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని అన్నారు.కవిటి పిహెచ్‌సి తమ హయాంలోనే సిహెచ్‌సిగా మార్చారని అన్నారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియమించి, సోంపేటలో మత్తు వైద్యులను కూడా నియమించిన ఘనత తమదని తెలిపారు. కిడ్నీ రోగులకు ఎవరి హయాంలో ఎన్ని పింఛన్లు ఇచ్చామో వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పంచాయతీ విభాగం రాష్ట్ర ఉమ్మడి కార్యదర్శి పూడి నీలాచలం, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

లారీలో బ్యాటరీ చోరీ

ప్రజాశక్తి- పలాస

చోరీకి గురైన బ్యాటరీ

స్థానిక తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో నిలిపి ఉన్న లారీ బ్యాటరీని గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. దీని విలువ రూ.25 వేలు ఉంటుందని సంబంధిత యజమాని ధర్మారావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి లారీని విజయదశమి సందర్భంగా పూజ చేసుకోవడానికి వచ్చి తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో నిలుపుదల చేశాడు. బుధవారం ఉదయం వచ్చేసరికి లారీ దిగువభాగం విరగొట్టి ఉన్నట్లు గుర్తించాడు. అనంతరం పరిశీలించేసరికి లారీకి అమర్చిన బ్యాటరీ మాయం అయింది. దీంతో చుట్టుపక్కల వెతగ్గా బ్యాటరీ బయటకు రాకుండా ఉండే కర్రలను సమీపంలో గుర్తించాడు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని దూగానపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని గ్రామ యువత బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇంతకుముందు నలుగురు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ఇప్పుడు ఒకేఒక్కరు ఐదు తరగతులను బోధిస్తున్నట్టు కలెక్టర్‌కి వివరించారు. విద్యార్థుల సంఖ్య 14 నుంచి 59కి పెరిగినా పరిస్థితి మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించి సమస్య పరిష్కరించాలని కోరారు. అదే సమయంలో జాడుపూడి నుచి బొరివంక వెళ్లే రోడ్డులో దూగానపుట్టుగ గ్రామం నుంచి చుట్టు పక్కల ప్రాంతాల్లో కనీసం మరమ్మతులు కూడా చేయలేదని అన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని జన సైనికులు దివాకర్, సిసింద్రీ కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

సమస్యను వివరిస్తున్న యువకులు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పలాస : ప్రభుత్వ గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్ మిషన్ చొరవతో స్వచ్ఛ షహర్ జోడి నగరాలుగా అభివృద్ధి చేయడానికి రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదురిందని కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా వంద రోజుల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ, పబ్లిక్ స్థలాల్లో పరిశుభ్రత, పరిశుభ్రత పాటించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు.

పయనమవుతున్న జట్టు

సౌత్ జోన్ పోటీలకు పయనం

ఎచ్చెర్ల : కర్ణాటకలోని బెల్గావి వద్ద ఉన్న రాణి చిన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 4 నుంచి 7 వరకు నిర్వహించనున్న జగన్ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు పాల్గొనేందుకు ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం జట్టు బుధవారం పయనమైంది. ఈ జట్టుకు కోచ్‌గా ఎం.గణేష్ వ్యవహరిస్తున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న తొలి జట్టు కబాడ్డీ క్రీడాకారులు నైపుణ్యాలు ప్రదర్శించే యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని వ్యాయామ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ కోరారు.

బీరు పరిశ్రమ కార్మికుల తొలగింపు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని బంటుపల్లి పంచాయతీ పరిధిలో కంబాలపేట గ్రామ సమీపంలో ఉన్న యునైటెడ్ బ్రేవరీస్ (బీరు పరిశ్రమ)లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న వైసిపి సానుభూతి పరులని చెప్పి అన్యాయంగా తొలగించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్న కృష్ణంరాజు అనే వ్యక్తి స్థానిక ఒక నాయకుడు అండదండలతో చెప్పినట్టు వ్యవహరించి కార్మికులను ఎటువంటి కారణం లేకుండా అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్మికులు రోడ్డున పడి జీవనం గడపడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తినడానికి తిండి లేక, పిల్లలు స్కూల్ ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. వారం రోజుల్లోగా విధుల్లోకి తీసుకోకపోతే తొలగించిన కార్మికుల కుటుంబాలు, వైసిపి కార్యకర్తలతో పరిశ్రమ ముందు పెద్ద ఎత్తున ధర్నా, నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర అనుబంధ ప్రచార విభాగం జాయింట్ సెక్రటరీ కెల్ల రామకృష్ణ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుందరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

నాచు పట్టిన రోడ్డుతో అవస్థలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని కొన్ని వార్డుల్లోని వీధులు రోడ్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారారు. రోడ్లపైనే వర్షపు, మురుగునీరు నిల్వ ఉండడంతో పట్టణ ప్రజల పాట్లు వర్ణాతీతంగా మారాయి. రోజూ ఏదో ఒక సమయంలో చిరుజల్లులు కురుస్తుండడం వల్ల రహదారులపై వర్షపు నీరు నిలవ ఉండి సిసి రహదారులు నాచుపడుతున్నాయి. ఈ నాచు పట్టిన రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు కాలినడకన వెళ్తున్న వృద్ధులు జారి పడిపోతున్నారు. పట్టణంలోని 12వ వార్డు చంద్రయ్యపేట ప్రాంతంలోని ఒక వీధిలో రహదారిపై నిత్యం నీరు నిల్వ ఉండడంతో పాటు వీధి దీపాలు సరిగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రజలు నీరు నిలవ ఉన్న ప్రాంతంలో భయాందోళన మధ్య జీవనం సాగించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని గగ్గోలు పెడుతున్నారు. అంతేకాకుండా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు కాలువల్లో పిచ్చి మొక్కలు వేపుగా పెరిగి పారిశుధ్యం లోపించి దోమలు విలయతాండవం చేస్తున్నాయని ఆ వీధికి చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రహదారులపై వర్షపు నీరు మురుగనీరు నిలవ లేకుండా చర్యలు చేపట్టి భవిష్యత్‌లో రహదారులపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పురపాలక సంఘ అధికారులు చూడాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

నిల్వ ఉన్న వర్షపునీరు

కనీస వేతనాల సలహా మండలి సభ్యునిగా సూరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సూరిబాబు

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలికి 20 మంది డైరెక్టర్లను నియమించారు. నగరానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, 31వ డివిజన్ ఇన్‌ఛార్జి, జంగమ సాధికారిక డైరెక్టర్ విభూది సూరిబాబుకి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులుగా నియమించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక నాయకులు, కూటమి నాయకులు సూరిబాబుకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమ్మకం ఉంచి పదవినిచ్చిన పార్టీ పెద్దలకు స్థానిక నాయకత్వానికి అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి బలోపేతానికి తనకిచ్చిన పదవికి వన్నెతెచ్చేలా మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు.

గుండెపోటుపై అప్రమత్తం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డాక్టర్ అనిరుధ్‌కుమార్

సరైన నియమాలు ఆహార జీవనశైలి, డాక్టర్ సలహాలతో ముందుకు సాగితే 80 శాతం గుండె పోటు నివారించవచ్చునని ప్రముఖ కార్డియో వేసక్యులర్ తోరాసిక్ సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రిమ్స్ డాక్టర్ పైడి అనిరుద్‌కుమార్ అన్నారు. ఆహార నియమాలు పాటించాలన్నారు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలని తెలిపారు. ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు ఎప్పటికప్పుడు డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. 40 ఏళ్ల వయసు దాటిన వాళ్లు ఏడాదికోసారైనా ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇలా పాటిస్తే గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చు తెలిపారు. వాకింగ్, జాగింగ్, రన్నిర్గ్ వంటి వ్యాయామాలు ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు. వారంలో కనీసం ఐదు రోజులు 45 నిమిషాలు చొప్పున వ్యాయామం చేయాలన్నారు. మానవ శరీరంలో అత్యంత కీలకమైంది గుండె అని అన్నారు. ప్రస్తుత కాలంలో గుండె పోటుతో మృతి చెందిన వారి సంఖ్య పెరుగుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఇటీవల కాలంలో గుండె పోటులు ఎక్కువగా అవుతున్నాయని తెలిపారు. ఛాతిలో నొప్పి నావటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తటం, చల్లని చెమటలు పట్టటం, కళ్లు తిరగడం, అలసట ఎక్కువగా ఉండటం, గుండె దడ పెరగటం, కాళ్లు లేక పాదాలు వాపులు వస్తుంటుందని అన్నారు. రెగ్యులర్ చెకప్, మందులు, వ్యాయామ క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఆహార అలవాట్లులో మార్పుల వల్ల సాధారణ పరిస్థితి సాధ్యమవుతుందని తెలిపారు.

బెల్టుషాపుల్లో భారీగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో దసరా పండగ పేరుతో పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ద్వారా భారీగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ఇది తెలిసినా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దసరా పండగ నేపథ్యంలో రెండు రోజుల ముందే మద్యం చేరుకుంది. అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలపై నిషేధాజ్ఞలు ఉన్నాయి. అయినా భారీగా మద్యం అమ్మకాలు చేసేందుకు బెల్ట్ షాపుల్లో నిల్వలు పెట్టుకున్నట్లు సమాచారం. ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తే పెద్ద మొత్తంలో మద్యం లభిస్తుందని గ్రామస్తులు అంటున్నారు. కానీ, ఎక్సైజ్ అధికారులు గాంధీ జయంతి సందర్భంగా దాడులు చేస్తారా? లేదా? వేచి చూడాలి.

డిటిఒగా రామ్మోహనరావు

రామ్మోహనరావు

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డిటిఒగా కవిటి రామ్మోహనరావు ఉద్యోగోన్నతులు పొందారు. క్యాంపస్‌కు డిప్యూటేషన్‌పై అకౌంట్ ఎఒగా బాధ్యతలు నిర్వహించారు. రెండేళ్లుగా అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతి కల్పిస్తూ... విశాఖపట్నం ఖజానా, లెక్కల శాఖకు జిల్లా అధికారిగా, డిటిఒగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పూర్తిస్థాయిలో పని

రణస్థలం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో పని దొరుకుతుందని బీరు పరిశ్రమ కార్మికులు ముంగం శ్రీనివాసరావు, కాకి చిన్నారావు, ఎల్డుటి రమేష్, సీల వెంకటరమణ, టొంపల రమేష్, కందివలస మాలచ్చయ్య, సప్ప గంగలు, యామల చిన్నవాడు, టొంపల అప్పారావు, తిరుమరెడ్డి సతీష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో పనులు లేక చాలా ఇబ్బంది పడ్డామని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి డ్యూటీలు సాఫీగా సాగుతున్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బురదజల్లే కార్యక్రమాలు చేపట్టం మంచి పరిణామం కాదని అన్నారు. గతంలో ఆరు డ్యూటీల దొరికేదని, ఇప్పుడు నెలలో 24 డ్యూటీలు చేసుకుంటూ కుటుంబాలతో సంతోషంగా ఉంటున్నామని అన్నారు.

కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండ

క్యుఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సంతబొమ్మాళి : వైసిపి కార్యకర్తలకు మాజీ సిఎం జగన్ ప్రారంభించిన డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కెళ్లి జగన్నాయకులు అన్నారు. ఈ మేరకు సంతబొమ్మాళిలో డిజిటల్ బుక్ క్యూర్ బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురవుతున్న ప్రతి వైసిపి కార్యకర్తా దీనిపై అవగాహన పెంచుకొని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బుడ్డా మోహన్‌రెడ్డి, మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, పాలతలగం ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, టెక్కలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నక్కిట్ల నరేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు కొన్న శ్రీరాములు, కళింగపట్నం నాగరాజు, మల్ల రాజు, రొయ్య ఆనంద్ పాల్గొన్నారు.

నేతేరులో అన్నదానం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని నేతేరులో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు సందర్భంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పురోహితులు నేతేటి వెంకటశర్మ, అచ్యుతరావుశర్మ పరివేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రహశిల్పి కాళహస్తి శంకరరావు దంపతులు మహా చండీ యాగం చేయించారు. అన్నదానంలో పట్నావానిపేట, నేదురుపేట, రేగపాలెం, తామాడ, దేశిపాలేం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

బెంతు ఒరియాలపై మాట్లాడాలి

టెక్కలి: ఆదివాసీ కుటుంబాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు అవగాహన అవసరమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనల తెలిపారు. జిల్లాలో నకిలీ బెంతు ఒరియా ధ్రువీకరణ పత్రాలపై ఉద్యోగాలు చేస్తున్న వారిని గురించి శాసనసభలో ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. జిల్లాలోని అసలైన బెంతు ఒరియాల గురించి తెలుసుకోవాలంటే విశాఖపట్నంలోని గిరిజన సాంస్కృతిక, సంప్రదాయ పరిశోధన సంస్థకు వెళ్లి పరిశీలించాలన్నారు. బెంతు ఒరియాలపై విప్ వైఖరి మారాలని, లేకుంటే స్థానిక సంస్థాగత ఎన్నికల్లో తమ ప్రభావం చూపుతామని అన్నారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు శాసనసభలో ఎందుకు ప్రస్తావించడం లేదన్నారు. ఆదివాసీల మనోభావాలు దెబ్బతినకుండా విప్ మాట్లాడాలని, ఇదే ధోరణి ఆదివాసీలపై విప్ చూపితే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ప్రకటనలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు జన్నిదాలయ్య, బొమ్మాళి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగారావు ఉన్నారు.

మాట్లాడుతున్న కూర్మారావు

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మందస : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పల్లెపల్లెకు వెళ్లి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సీతంపేట వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పూడి కూర్మారావు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచ సూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వారు ఆర్థిక, సామాజిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్టు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన శిక్షణలు, పశు పోషణ, డైరీ, పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆవులు, గేదెలు, కోళ్ల, గొర్రెలు, చేపల పెంపకం, పశుదానా తయారీ యూనిట్లు, మునగ, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్స్ అభివృద్ధి కోసం హార్టికల్చర్‌లో సబ్సిడీపై షేడ్, నెట్లు ఏర్పాటు అంశాలపై సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ తారక మోహన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ముఖలింగం, మంగమ్మ, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో 12 తులాల బంగారం స్వాధీనం

కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డిఎస్‌పి లక్ష్మణరావు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని కంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన చోరీ కేసులో కవిటి గ్రామానికి చెందిన నాగుల సోని అనే హిజ్రాను అరెస్టు చేసి 12 తులాల బంగారం, 55 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామని కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డిఎస్‌పి డి.లక్ష్మణరావు తెలిపారు. కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కంచిలికి చెందిన విశ్రాంత లెక్చరర్ పురి సింహాద్రి ప్రదానో కుటుంభీకులతో కలిసి జూలై నెల 5న విశాఖపట్నం వెళ్లి 6 రాత్రి వచ్చారని అన్నారు. ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడంతో పరిశీలించారని తెలిపారు. ఇంట్లోని 25 తులాల బంగారం, కేజీ వెండి ఆభరణాలు చోరీకి గురయినట్లు ఆయన 8న కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో సొంపేట సిఐ మంగరాజును చూసిన హిజ్రా సోని పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన బాబు, కబాడియా, సనాటా, టున్ని వ్యక్తులు బూరలు అమ్మడానికి ఈ ప్రాంతానికి రావడంతో వారితో పరిచయం ఏర్పడిందని అన్నారు. వారితో కలిసి జూలై 5న కంచిలిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డామని అన్నారు. ఆ చోరీలో తన వాటాగా వచ్చిన బంగారం, వెండి బరంపురం తీసుకువెళ్లి విక్రయించేందుకు భయలు దేరారని హిజ్రా చెప్పారని అన్నారు. హిజ్రాను అరెస్టు చేసి చేశామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిఐ మంగరాజు, కంచిలి ఎస్ఐ పారినాయుడు, హెడా కానిస్టేబుళ్లను ఎస్‌పి ద్వారా రివార్డులు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి లక్ష్మణరావు

ప్రభాకర్ పట్నాయక్ సేవలు చిరస్మరణీయం

మందస: ఉపాధ్యాయునిగా 28 ఏళ్లకు పైగా పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి ప్రభాకర్ పట్నాయక్ మాస్టర్ అని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాక్షులు గవ్వ భీమారావు అన్నారు. ప్రభాకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం రాత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పనిచేసిన ప్రతిచోటా విద్యార్థులకు బోధించిన తీరు, ఆయా పాఠశాలల పరిధి ప్రజలతో మమేకమై పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కర్రి సుందరరావు, పి.మల్లిఖార్జునరావు, పి.కృష్ణారావు, డి.వైకుంఠరావు, సింహాచలపతి, బి.మురళీమోహన్, ఎస్.గణేశ్వరరావు, డి.చంద్రశేఖర్, బి.రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భీమారావు

గోతులు కప్పేందుకు తెచ్చిన చిప్స్ ఇసుక

కలెక్టర్ వస్తున్నారని...

ప్రజాశక్తి- కవిటి

కవిటి బస్టాండ్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, ఎనర్జీఎస్ కార్యాలయం, శ్మశానవాటికతో పాటు మండల ఇలవేల్పు చింతామణి అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి అది. తీరంలో కోతకు గురైనట్టు రెండు వైపులా తెగిపోయి కనీసం ఎదురుగా వాహనం వచ్చినప్పుడు పక్కకు దిగేందుకూ అవకాశం లేని మార్గమది. దానికి ఇరువైపులా ఆక్రమణలు ఫుట్ పాత్‌లు. వీటన్నింటికీ మించి ఎంపిడిఒ కార్యాలయం ముందు గోతులు. పైకి వెళ్లేందుకు గతుకులు. అయితే ఉన్నట్టుండి బుధవారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గోతులు కప్పేశారు. కోతకు గురైన రోడ్డుకు రెండు వైపులా శుభ్రం చేశారు. బ్లీచింగ్ చల్లి పారిశుధ్య పనులు నిర్వహించారు. ఇది చూసిన స్థానికులు ఏంటిది ఎప్పుడూ లేని హడావుడి అనుకున్నారు. ఈలోగా కలెక్టర్ వస్తున్నారని తెలిసి దటీజ్ పవర్ ఆఫ్ కలెక్టర్ అనుకున్నారు.

విజేతలకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

బైరిపురం కల్చరల్ క్లబ్ (బిసిసి) ఆధ్వర్యాన బైరిపురంలో ఈ ఏడాది కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు విజేతలకు బుధవారం ఘనంగా సన్మానించారు. మెగా డిఎస్‌సి ఫలితాల్లో ప్రియా శంకరరావు కుమారుడు శ్రీకర్, కుమార్తె షర్మిల ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వారితోపాటు ఇటీవల బైరిపురంలో ఉద్యోగాలు సాధించిన బొర్ర శ్రీదీప్తి, నర్తు శైలజ, జె.నాగమణి, ప్రియామహేష్‌ను, వారి తల్లిదండ్రులను గ్రామ పెద్దలు, బిసిసి సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత అవధాని మడ్డు తిరుపతిరావు నిర్వహించిన గణిత అవధాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గణిత అవధాని మడ్డు తిరుపతిరావు, గ్రామంలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు కుమారి, టి.హిమగిరిని సభ్యులు ఘనంగా సన్మానించారు.

పేదోడికి వైద్యం దూరం చేసే కుట్ర

ప్రజాశక్తి- పలాస

దుర్యోధన

వైద్యం, విద్య కూటమి ప్రభుత్వంలో అందని ద్రాక్షగా మారనుందని వైసిపి జిల్లా అధికార పార్టీ ప్రతినిధి, చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన అన్నారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో 17 వైద్య కళాశాలలకు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రైవేటీకరణ చేసేందుకు చూస్తోందని, తక్షణమే అటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. పిపిపి విధానం రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్మాణాలు పూర్తి చేసి.. ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పేదలకు వైద్య, విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం దూరం చేస్తూ కార్పొరేటర్లకు మేలు చేకూరుతుందన్నారు. పేదలను వంచిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జిఎస్‌టి ధరల తగ్గింపుపై అవగాహన

మెళియాపుట్టి: ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిఎస్‌టి 2.0 తగ్గింపు ధరలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కొసమాలలో 'సూపర్ జిఎస్‌సి-సూపర్ సేవింగ్స్‌పై ట్రాక్టర్లతో అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాక్టర్‌ను స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లపై 12 నుంచి 5 శాతానికి జిఎస్‌టి ధరలు తగ్గాయని అన్నారు. గ్రామీణ వ్యాపారస్తుల నుంచి రైతు బజార్లు, చిన్నచిన్న వ్యాపారులు ఈ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా లాభాలు పొందగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, ఎఒ ఎస్.దానకర్ణుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, నంబాల వెంకటరావు, బొచ్చు ప్రసాదరావు, భైరిసింగి దినకర్, చాపర మాధవరావు, కదంబల పైడిరాజు, బమ్మిడి జగన్నాథం, బూర్ల లలితకుమారి పాల్గొన్నారు.

పొందూరు : జిఎస్‌టి 2.0తో వ్యవసాయ యంత్ర, పరికరాలు తగ్గింపును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. పొందూరు మండలంలో వ్యవసాయ యంత్ర పరికరాలు ధరల తగ్గింపుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు చేయడం ద్వారా సాగు ఖర్చులు బాగా తగ్గించుకోవచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాస్‌బాబు, డిటి శ్రీధర్, ఎపిఒ శ్రీనివాసరావు, ఇఒ మోహన్‌బాబు, విఎఎ కాశీకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక సచివాలయంలో సూపర్ జిఎస్‌టిపై ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, ఎఒ ఎస్.గోవిందరావులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టాక్టర్ ర్యాలీ నిర్వహించారు.

నందిగాం : మండలంలోని పెంటఊరులో ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యాన జిఎస్‌టి తగ్గింపుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. రైతులు తమ వాడే వ్యవసాయ పనిముట్లపై వ్యవసాయ వినియోగ వస్తువులపై 12 శాతం ఉన్న జిఎస్‌టిని ఐదు శాతానికి తగ్గించారని అన్నారు. ట్రాక్టర్ టైర్లకు, విడిభాగాలకు గతంలో ఉన్న 18 శాతాన్ని ఇప్పుడు ఐదు శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యవసాయ డ్రోన్లపై గతంలో 18 శాతమని, ఇప్పుడు 5 శాతం కుదించినట్టు చెప్పారు. దీనిద్వారా రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రగడ వాసవి, విఎఎలు డి.అరవింద్, రైతులు జె.నారాయణరావు, సనపల సూర్యం, వెండి గిరిబాబు, బి.త్రినాథరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

పొందూరు : అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోటలో ఎఒ మెట్ట మోహనరావు ఆధ్వర్యాన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లపై జిఎస్‌టి తగ్గింపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ విజేత బొరివంక

కవిటి: మండలంలోని నెలవంకలో సరస్వతి దేవి పూజ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం రాత్రి నిర్వహించిన క్విజ్ పోటీల్లో బొరివంక జడ్‌పిహెచ్‌ఎస్ ప్రథమ స్థానం, ముత్యాలపేట జడ్‌పిహెచ్‌ఎస్ ద్వితీయ స్థానం, రాజపురం జడ్‌పిహెచ్‌ఎస్ తృతీయ స్థానాలను సాధించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు, కవిటి మండల విద్యాశాఖ అధికారులు ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ, డిఎస్ఆర్ ఆస్పత్రి డాక్టర్ సురేశ్, సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సరస్వతి దేవి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు

స్వచ్ఛందంగా రక్తదానం చేద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని, రక్తం కొరత లేకుండా దానం చేయాలని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 15 మంది స్వచ్ఛంద రక్తదాతలు రక్తదానం చేశారు. దాతలకు ధ్రువపత్రాలు, గోల్డ్ ప్లేటెడ్ మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత రోజురోజుకీ పెరుగుతున్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొరతను అధిగమించడానికి రక్తదానాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని, రక్త నిల్వలు పెరగడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని చెప్పారు. ప్రధానంగా యువత, విద్యార్థులు రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. అనంతరం పిఎన్ కాలనీ సమీపంలో మహిళలకు రక్తదానంపై అవగాహన కల్పించారు. వారితో రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, గాంధీ మందిర్ సభ్యులు, 25వ సారి రక్తదాతలు అయిన శాస్త్రి, పి.శ్రీకాంత్, కళ్యాణ్ చక్రవర్తి, కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, జి.రమణ, నందీశ్వరరావు, నక్క శంకరరావు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న జగన్మోహనరావు

స్థలాన్ని పరిశీలిస్తున్న బాబూరావు

5న రైతులతో సమావేశం

పలాస : కాశీబుగ్గ రైల్వే ఇన్స్టిట్యూట్ ఈ నెల 5న కార్గో ఎయిర్ పోర్టుకు భూముల కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. ఈ మేరకు సమావేశ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్టుపై అపోహలు నివృత్తిచేసేందుకు కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ సమావేశానికి హాజరు అవుతున్నారని తెలిపారు. అందులో భాగంగా స్థల పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణతోనే అభివృద్ధి

గోవిందరాజులు

కోటబొమ్మాళి: అధికార వికేంద్రకరణ ద్వారానే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, టిడిపి కళింగ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. బుధవారం తన స్వగృహం కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో సమితులు, జిల్లా పరిషత్ పాలనలు భలంగా ఉండేవని, సర్పంచ్ తీర్మానం చేసి గ్రామానికి కావాల్సిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులకు సరైన అధికారం ఉంటే ప్రజా సేవ చేసేందుకు, అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

సిఎంను కలిసిన 'పిన్నింటి'

ప్రజాశక్తి - రణస్థలం

విజయనగరం జిల్లా గజపతినగరం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి బుధవారం సిఎం చంద్రబాబు నాయుడు వచ్చారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు సమక్షంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాజీ సిఎం ఎన్‌టిఆర్ రాజకీయ జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పంచాయతీ సమస్యలపై వివరించారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

నరసన్నపేట : స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తలకు పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య దిశా నిర్దేశం చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొనేలా చూడాలన్నారు.

నీలమణి దుర్గమ్మ ఆలయం సందర్శన

పోలాకి : మండలంలోని మొగిలిపేటలో పాతపట్నం నీలమణి దుర్గ ఆలయాన్ని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య దర్శించుకున్నారు. ఈయన వెంట వైసిపి రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, సర్పంచ్ బంకా చక్రధర్, కనపల శేఖరరావు, ఎంపిటిసి తూలుగు అశోక్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్, ఏడూరు శ్రీధర్, అసిరినాయుడు, మండల యూత్ ఉపాధ్యక్షులు పి.రమణ, తోట భార్గవ్, బమ్మిడి రాజు పాల్గొన్నారు.

కవులకు గాంధీ సాహితీ పురస్కారం

వజ్రపుకొత్తూరు : సన్మానిస్తున్న సాహితీ ప్రముఖులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కవి, రచయిత, సీనియర్ పాత్రికేయులు ఎం.నాగేశ్వరరావుకు గాంధీ సాహితీ పురస్కారం లభించింది. శ్రీకాకుళంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ప్రోత్సాహంతో బుధవారం గాంధీ సాహితీ కవితోత్సవంలో నిర్వహించారు. ఇందులో మండలంలోని బైపల్లికి నాగేశ్వరరావు వినిపించిన 'అడుగు జాడలు' అనే కవితకు సాహిత్య వేత్తలు, సభికులు విశేషంగా ప్రశంసించారు. ఈ సన్మానంపై అభ్యుదయ ఆంధ్ర హైస్కూల్ ప్రిన్సిపాల్ మొరిపల్లి బాబూరావు, ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం కన్వీనర్ లండ రుద్రమూర్తి, భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు, సీనియర్ జర్నలిస్టు శివజ్యోతి, శివ కుమార్, బైపల్లి యువజన సేవా సంఘం అధ్యక్షుడు పర్సుపల్లి వెంకటరావు, ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి ఉపాధ్యక్షులు కొండప్ప వెంకటరావు, సలహాదారుడు మొరిపల్లి ధర్మారావు పాల్గొన్నారు.

పలాస : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీకాకుళం శ్రీశ్రీ కళావేదిక యూనిట్ ఆధ్వర్యాన మేనేజింగ్ డైరెక్టర్ కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ప్రోత్సాహంతో గాంధీ సాహితీ కవితోత్సవం నిర్వహించారు. కారణ జన్ముడు కవితా గానాన్ని పలాసకు చెందిన కవి, రచయిత, జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి గాంధీ సాహితీ పురస్కారం లభించింది. ఆయనను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, శ్రీశ్రీకళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు డబ్బీరు గోవిందరావు, జిల్లా అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరావు, బి.ఉమామహేశ్వరరావులు అవార్డును జ్ఞాపికను ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ కళ్యాణ్‌బాబు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్రరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో స్వస్తి నారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ ప్రభుత్వశాఖాధికారులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రుల సామాన్య అధికారి డాక్టర్ కళ్యాణబాబు పాల్గొని ఆహార స్టాల్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల పండ్లు, వివిధ విటమిన్ పదార్థాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. గర్భిణులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఎంత బరువు ఉండాలి, చిన్న పిల్లలు పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.రాజేశ్వరి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు అనూష, శిల్ప, రమేష్ నాయుడు, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.